RNI NO.TELTEL/2022/83842

PRABHAT A GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 222 | సంపుటి 4 | గురువారం | 30-04-2026 | పేజీలు 4 | వెల 3/-

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374




- మీ పిల్లలని మా కాలేజీలోనే చేర్పించాలంటూ మాయ మాటల జోరు
- ప్రత్యేక టీం లను ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు ఫోన్ల మీద ఫోన్లు
- గ్రామాల్లో పీఆర్వోలతో ప్రత్యేక నెట్ వర్క్
- విద్యార్థులను చేర్పించేందుకు రకరకాల ప్రలోభాలు
- ఒక్కో అడ్మిషన్ కు రూ.5 వేల నుండి 6 వేల వరకు కమిషన్
- రాష్ట్రంలోని విద్యాసంస్థల తీరుపై విస్మయం
- నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ అధికారులు

# అక్షరం.. అంగడి సరుకు!

2

## విద్యే వ్యాపారంగా అడ్మిషన్ల దందా..

రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలు లాభార్జనే ధ్యేయంగా అక్షరాన్ని అంగడి సరుకుగా మారుస్తున్నాయి. అప్పుడే పసిప్రాయం దాటి పదో తరగతి వార్షిక పరీక్షల తుది అంకానికి చేరుకున్న విద్యార్థులపై కార్పొరేట్ శక్తులు యుద్ధం ప్రకటించాయి. పరీక్షల ఒత్తిడిలో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తమ మాయాజాలంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విద్యను ఒక పవిత్రమైన ప్రక్రియగా చూడాల్సిన యాజమాన్యాలు, అడ్మిషన్లే పరమావధిగా 'సీట్ల వేట'ను ముమ్మరం చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అడ్మిషన్ల పేరుతో సాగుతున్న ఈ అక్రమ దందాలో విద్యార్థులు కేవలం లాభాలు తెచ్చిపెట్టే వ్యాపార వస్తువులుగా మారుతుండటం విద్యా వ్యవస్థలోని నైతిక పతనానికి అద్దం పడుతోంది. ఒకవైపు విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో తమ భవిష్యత్తును వెతుక్కుంటుంటే, మరోవైపు కార్పొరేట్ విద్యాసంస్థలు వారి వ్యక్తిగత సమాచారాన్ని వేటాడుతున్నాయి. డేటా చోరీ ద్వారా సేకరించిన ఫోన్ నంబర్లతో తెల్లవారుజాము నుంచే తల్లిదండ్రులకు ఫోన్ల మోత మోగిస్తున్నాయి. "మీ అబ్బాయి మా దగ్గర చేరితేనే ఐఐటియన్ అవుతాడు.. ఇప్పుడే బుక్ చేసుకుంటేనే రాయితీలు లభిస్తాయి" అంటూ ప్రలోభాలకు గురిచేస్తూ, సీట్ల రిజర్వేషన్ పేరిట కోట్లాది రూపాయల అనధికారిక వసూళ్లకు తెరలేపాయి. గ్రామస్థాయిలో సైతం 'పీఆర్వో'ల పేరుతో ప్రత్యేక నెట్ వర్క్ లను ఏర్పాటు చేసి, చదువు చెప్పాల్సిన చేతులతో అడ్మిషన్ల కోసం కమీషన్ల బేరసారాలు సాగిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఈ మొత్తం ఉదంతంలో విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటన్నది ఇప్పుడు సామాన్య ప్రజల ప్రశ్నగా మారింది. — హైదరాబాద్, ప్రభాత గమనం



# రైతుబంధు ఆగిపోయింది.. 'రాహుల్ బంధు' సాగుతోంది!

- కాంగ్రెస్ పై కేటీఆర్ నిప్పులు.. బీఆర్ఎస్ లోకి భారీగా చేరికలు
- రేవంత్ రెడ్డిది 'కుంభకర్ణ' పాలన.. మోసపూరిత హామీలతో అధికారంలోకి
- రైతులపై ప్రేమ ఉంటే వాయిదాలెందుకు? నిలదీసిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

2

"గత పదేళ్ల బీఆర్ఎస్ కాలంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి రెండున్నరేళ్లలోనే రూ.3.70 లక్షల కోట్ల అప్పు చేశారు. మరి ఈ పైసలన్నీ ఎవరికి వెళ్లాయి. రైతుబంధు పడ్తలేదు. రాహుల్ బంధు మాత్రం జోరుగా నడుస్తోంది. ఎన్నికల ముందు దానవీర శూర కర్ణ, ఏదీ కావాలంటే అది ఇస్తామన్నారు. ఇప్పుడు కుంభకర్ణ. ఎలక్షన్ల ముందు పాలమూరు బిడ్డ. ఇప్పుడేమో పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డా. ఎందుకు ఈయన ముఖ్యమంత్రిగా ఉండి ఏం లాభం ఈ రాష్ట్రానికి. నాగర్కర్నూల్లోని రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. రైతుల ధాన్యం వానకు తడిసి వారిని చూసి బాధనిపిస్తలేదా? ఈ అంశాలపై మేం ప్రశ్నిస్తుంటే ఆయనకు సంగీతంలాగా ఉందటా. పైశాచిక ఆనందం వస్తుందని అంటున్నారు" -కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

# హైదరాబాద్ మెట్రో ఇక ప్రభుత్వానిదే!

- ఎల్ అండ్ టీ నుంచి వంద శాతం షేర్ల బదిలీ.. కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- రూ.1,461.47 కోట్లతో కొనుగోలు.. రూ.13,538 కోట్ల అప్పు రీఫైనాన్స్
- మెట్రో ఫేజ్ -2 విస్తరణకు లైన్ క్లియర్

భాగ్యనగర రవాణా ముఖచిత్రం మారిపోయింది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచిన హైదరాబాద్ మెట్రో రైలు (ఫేజ్-1) ఇకపై పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ పరం కానుంది. లార్సన్ అండ్ టూబ్రో (L&T) సంస్థ నుంచి మెట్రో వాటాలను కొనుగోలు చేసే ప్రక్రియ గురువారంతో అధికారికంగా ముగిసింది. సుమారు రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువతో మెట్రోలో ఉన్న 100 శాతం షేర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ ఒప్పందంతో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఇప్పుడు ప్రభుత్వ సంస్థగా అవతరించింది.



2

ముగ్గురు ఇన్ స్పెక్టర్లకు డీఎస్పీలుగా

# పదోన్నతి

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఇన్ స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన అధికారుల్లో హనుమకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ గొర్ల సీతారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ సార్ల రాజు, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్ స్పెక్టర్ బోలగాని శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.



3





# అక్షరం.. అంగడి సరుకు!

- విద్యే వ్యాపారంగా అడ్మిషన్ల దందా..
- మీ పిల్లలని మా కాలేజీలోనే చేర్పించాలంటూ మాయ మాటల జోరు
- ప్రత్యేక టీం లను ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు ఫోన్ల మీద ఫోన్లు
- గ్రామాల్లో పీఆర్వోలతో ప్రత్యేక నెట్వర్క్
- విద్యార్థులను చేర్పించేందుకు రకరకాల ప్రలోభాలు
- ఒక్కో అడ్మిషన్ కు రూ.5 వేల నుండి 6 వేల వరకు కమిషన్
- రాష్ట్రంలోని విద్యాసంస్థల తీరుపై విస్మయం
- నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ అధికారులు




హైదరాబాద్, ప్రభాత గమనం :

తెలంగాణలో పదో తరగతి విద్యార్థులు తమ జీవితంలో అత్యంత కీలకమైన వార్షిక పరీక్షలు వ్రాసి ఉండగా మరోవైపు కార్పొరేట్ విద్యా సంస్థలు వారిని కేవలం లాభాలు తెచ్చి పెట్టే వ్యాపార వస్తువులుగా చూస్తూ అడ్మిషన్ల వేటను ముమ్మరం చేశాయి. సీట్ల రిజర్వేషన్ల పేరుతో కోట్లాది రూపాయల దందాను ఈ కార్పొరేట్ సంస్థలు సాగిస్తున్నాయి. విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తూ తల్లి దండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకొని కార్పొరేట్ శక్తులు అక్షరాన్ని అంగడి సరుకుగా మారుస్తున్నాయి.

**- డేటా చోరీ.. ఫోన్లో మోత..**

విద్యార్థుల వ్యక్తిగత సమాచారం ఫోన్ నెంబర్లు అడ్రస్ కార్పొరేట్ కాలేజీల చేతుల్లోకి ఎలా వెళ్తుంది అనేది ప్రశ్నగా మారింది. స్కూల్లో నుంచి లేదా ఇతర మార్గాల ద్వారా డేటాను సేకరిస్తున్న ఈ సంస్థలు తెల్లవారుజాము నుంచి ఫోన్లో మోత మోగిస్తున్నాయి. మీ అబ్బాయి..మీ అమ్మాయి లకు మంచి మార్కులు వస్తాయి. మా దగ్గర ఇప్పుడే సీట్ బుక్ చేసుకుంటే ఫీజులు 50 శాతం రాయితీ ఇస్తాం అంటూ ఆశ చూపిస్తున్నాయి. ఒక కాలేజీ కాదంటే మరో కాలేజీ నుండి ఫోన్లు వస్తుండడంతో తల్లిదండ్రులు విసిగిపోతున్నారు.

**- గ్రామాల్లో పిఆర్వోల టీంలు...**

కేవలం ఫోన్ లకే పరిమితం కాకుండా ఈ కాలేజీలు ప్రత్యేకంగా అడ్మిషన్ టీం లను రంగంలోకి దించాయి. ఒక్కో మండలానికి , ఒక్కో గ్రామానికి పిఆ ర్వోలను కేటాయించి ఇంటింటికి పంపిస్తున్నారు. వీరు కేవలం విద్యావేత్తలు కాదు ,పక్క సేల్స్ మేన్ లాగా వ్యవహరిస్తున్నారు. మా కాలేజీలో చేరితేనే మీ పిల్లాడు డాక్టర్ అవుతాడు లేదా ఇంజనీర్ అవుతాడు అని నమ్మిస్తున్నారు. ఒక్కో అడ్మిషన్ చేయించినందుకు ఈ ఏజెంట్లకు రూ. 5 వేల నుంచి 6 వేల వరకు కమిషన్ అందుతుంది. దీంతో వారు విద్యార్థుల ఇళ్ళ ముందు తిష్ట వేస్తున్నారు.

**- నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ..**

**రాష్ట్ర వ్యాప్తంగా ఎంత పెద్ద ఎత్తున అక్రమ అడ్మిషన్లు దందా జరుగుతున్న ఇంటర్మీడియట్ బోర్డు లేదా విద్యాశాఖ ఉన్నత అధికారులు ఎందుకు స్పందించడం లేదనేది మింగుడు పడని అంశంగా మారింది. నిబంధనల ప్రకారం విద్య సంవత్సరం ముగిసి ఫలితాలు వచ్చిన తర్వాత అడ్మిషన్లు ప్రారంభించాలి. ప్రైవేట్ కాలేజీలో ప్రచారాలపై ఆశలు ఉండాలి . కానీ క్షేత్రస్థాయిలో అధికారులు ఈ కాలేజీల యాజమాన్యాలతో చేతులు కలిపి మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.**

**- జాయిన్ అయ్యాక అదనపు వసూళ్లే...**

అడ్మిషన్ సమయంలో చెప్పే ఫీజుకు చేరిన తర్వాత వసూలు చేసే ఫీజులకు అస్సలు పొంతన ఉండదు. అడ్మిషన్ ఫీజు కాకుండా ఏసీ చార్జీలు , మెటీరియల్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజు, స్పెషల్ కోచింగ్ ఫీజు అంటూ జాబితాలను సిద్ధం చేసి ఫీజులు పెంచుతూ పోతారు. మొదట రూ. 10 వేలు లేదా 20 వేలు కట్టి సీటు రిజర్వేషన్ చేసుకోమంటారు. ఒకవేళ విద్యార్థి వేరే కాలేజీకి వెళ్లాలి అనుకుంటే ఆ డబ్బులు తిరిగి ఇచ్చే ప్రసక్తే ఉండదు. పాత ర్యాంకులను ఎవరో సాధించిన విజయాలను తమవే అని ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్ల కోసం తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారు.

**- ఒత్తిడిలో విద్యార్థులు...ఆందోళనలో తల్లిదండ్రులు..**

పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు ఈ కాలేజీల వేధింపులతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. నువ్వు ఆ కాలేజీకి వెళ్తావా ? ఈ కాలేజీకి వెళ్తావా ? అంటూ తల్లిదండ్రులు అడిగే ప్రశ్నలు వారికి ఏకాగ్రతను దెబ్బతీస్తున్నాయి. చదువు కంటే అడ్మిషన్లకు ప్రాధాన్యత ఇస్తున్న ఈ కార్పొరేట్ సంస్కృతి వల్ల విద్యార్థుల సృజనాత్మకత నశించి పోతుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

**- గుర్తింపు రద్దు చేయాల్సిందే**

ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి పరీక్షలు ముగిసే వరకు ఏ కాలేజీ కూడా అడ్మిషన్లు తీసుకోకుండా, విద్యార్థులను వేధించకుండా, కఠినమైన ఆదేశాలు జారీ చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి కాలేజీలను గుర్తించి వాటి గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు విద్యా అనేది ఒక పవిత్రమైన ప్రక్రియ దానిని కేవలం లాభాపేక్ష తో కూడిన వ్యాపారంగా మార్చేస్తున్న కార్పొరేట్ శక్తులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే సామాన్య మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ఈ అడ్మిషన్ దందాలో బుగ్గిపాలయ్యే ప్రమాదం స్పష్టంగా కనబడుతుంది. ఇప్పటికైనా విద్యాశాఖ స్పందించి అలాంటి కార్పొరేషన్ శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి...



# రైతుబంధు ఆగిపోయింది.. 'రాహుల్ బంధు' సాగుతోంది!

- కాంగ్రెస్ పై కేటీఆర్ నిప్పులు.. బీఆర్ఎస్ లోకి భారీగా చేరికలు
- రేవంత్ రెడ్డిది 'కుంభకర్ణ' పాలన.. మోసపూరిత హామీలతో అధికారంలోకి
- రైతులపై ప్రేమ ఉంటే వాయిదాలెందుకు? నిలదీసిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

హైదరాబాద్, ప్రభాత గమనం:

తెలంగాణలో రైతుబంధు పథకం అటకెక్కిందని, కానీ ఢిల్లీకి నిధులు పంపే 'రాహుల్ బంధు' మాత్రం జోరుగా సాగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామా రావు (కేటీఆర్) ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిశిత విమర్శలు చేశారు.

**డైలాగుల సర్కార్.. అప్పుల దర్బార్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం స్పీచ్‌లకు, డైలాగులకే పరిమితమయ్యారని, ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదని కేటీఆర్ విమర్శించారు. "గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పు చేస్తే, రేవంత్ రెడ్డి కేవలం రెండున్నరేళ్లలోనే (ప్రస్తుత అంచనా) రూ. 3.70 లక్షల కోట్ల అప్పు చేశారు. మరి ఈ నిధులన్నీ ఎటు వెళ్లాయి? రైతులకు అందాల్సిన రైతుబంధు ఎందుకు పడటం లేదు?" అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు దానవీర శూరకర్ణలాగా హామీలిచ్చిన రేవంత్, ఇప్పుడు కుంభకర్ణలా నిద్రిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**రైతు గోస పట్టదా?**

రైతుల పట్ల ప్రభుత్వం పైశాచికంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. "నాగర్‌కర్నూల్ రైతులు రోడ్లపై ధర్నాలు చేస్తున్నారు. ధాన్యం వానకు తడిసి ముద్దవుతుంటే సీఎంకు బాధ నిపించడం లేదా? మేము ఈ సమస్యలపై ప్రశ్నిస్తుంటే ఆయనకు సంగీతంలా ఉందనడం ఆయన అహంకారానికి నిదర్శనం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుభరోసా నిధులను వాయిదాలుగా ఇవ్వడంపై నిలదీస్తూ, యూరియా కొరతను ఎందుకు తీర్చలేకపోతున్నారని ప్రశ్నించారు.

**పథకాలకు గుండె దమ్ముండాలి**

> **"గత పదేళ్ల బీఆర్ఎస్ కాలంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి రెండున్నరేళ్లలోనే రూ.3.70 లక్షల కోట్ల అప్పు చేశారు. మరి ఈ పైసలన్నీ ఎవరికి వెళ్లాయి. రైతుబంధు పడ్తలేదు. రాహుల్ బంధు మాత్రం జోరుగా నడుస్తోంది. ఎన్నికల ముందు దానవీర శూర కర్ణ, ఏదీ కావాలంటే అది ఇస్తామన్నారు. ఇప్పుడు కుంభకర్ణ. ఎలక్షన్ల ముందు పాలమూరు బిడ్డ. ఇప్పుడేమో పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ. ఎందుకు ఈయన ముఖ్యమంత్రిగా ఉండి ఏం లాభం ఈ రాష్ట్రానికి. నాగర్కర్నూల్లోని రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. రైతుల ధాన్యం వానకు తడిసి వారిని చూసి బాధనిపిస్తలేదా? ఈ అంశాలపై మేం ప్రశ్నిస్తుంటే ఆయనకు సంగీతంలాగా ఉందటా. పైశాచిక ఆనందం వస్తుందని అంటున్నారు"**
>
> **-కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

రైతుబంధు, దళితబంధు వంటి సాహసోపేతమైన పథకాలు అమలు చేయాలంటే గుండెల్లో దమ్ముండాలని, అది కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమని కేటీఆర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్ల కింద రూ. 6 లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు.

**ఆత్మవిమర్శ.. పునర్వైభవంపై ధీమా**

గత ప్రభుత్వంలో కొన్ని తప్పులు జరిగాయని కేటీఆర్ అంగీకరించారు. "అన్నీ సరిగ్గా అందినప్పుడు కేసీఆర్ విలువ ఎవరికీ తెలియలేదు. ఓటమి తర్వాత కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారడం, ఎంపీ సీట్లు గెలవకపోవడం వల్ల పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం సహజం. కానీ దెబ్బ తగిలినప్పుడే మనిషికి బుద్ధి వస్తుంది. కేసీఆర్ విలువ ఇప్పుడు ప్రజలకు అర్థమవుతోంది" అని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో మళ్ళీ ప్రజల పక్షాన పోరాడి బీఆర్ఎస్ పునర్వైభవం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ మెట్రో ఇక ప్రభుత్వానిదే!

- ఎల్ అండ్ టీ నుంచి వంద శాతం షేర్ల బదిలీ.. కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- రూ.1,461.47 కోట్లతో కొనుగోలు.. రూ.13,538 కోట్ల అప్పు రీఫైనాన్స్
- మెట్రో ఫేజ్ -2 విస్తరణకు లైన్ క్లియర్



హైదరాబాద్, ప్రభాత గమనం:

భాగ్యనగర రవాణా ముఖచిత్రం మారిపోయింది. ఇప్పటి వరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచిన హైదరాబాద్ మెట్రో రైలు (ఫేజ్-1) ఇకపై పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ పరం కానుంది. లార్సన్ అండ్ టూబ్రో (L&T) సంస్థ నుంచి మెట్రో వాటాలను కొనుగోలు చేసే ప్రక్రియ గురువారంతో అధికారికంగా ముగిసింది. సుమారు రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువతో మెట్రోలో ఉన్న 100 శాతం షేర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ ఒప్పందంతో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (HMRL) ఇప్పుడు ప్రభుత్వ సంస్థగా అవతరించింది.

**ముఖ్యమంత్రితో ఎల్ అండ్ టీ బృందం భేటీ**

ఈ కీలక ఒప్పందానికి ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ మరియు ఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మెట్రో అప్పగింత, ఫేజ్-2 విస్తరణపై వీరి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. అనంతరం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆధ్వర్యంలో షేర్ల బదిలీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. HMRL తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ తరఫున డీకే సేన్, కేవీబీ రెడ్డి పత్రాలు మార్చుకున్నారు.

**రుణాల భారం.. రీఫైనాన్స్ మార్గం**

ఒప్పందం ప్రకారం, ఎల్ అండ్ టీ హామీతో మెట్రోపై ఉన్న రూ.13,538.53 కోట్ల భారీ అప్పును (ఏప్రిల్ 30, 2026 నాటికి) ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ హామీతో రీఫైనాన్స్ చేశారు. ఈ సంక్లిష్ట ఆర్థిక లావాదేవీలకు ఐడీబీఐ (IDBI) క్యాపిటల్ ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా వ్యవహరించింది. దీనివల్ల వడ్డీ భారం తగ్గడమే కాకుండా, మెట్రో నిర్వహణపై ప్రభుత్వానికి పూర్తి పట్టు లభిస్తుంది.

**ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం**


మెట్రో ఫేజ్-1 (69 కి.మీ) ప్రభుత్వ స్వాధీనంలోకి రావడంతో ప్రతిపాదిత ఫేజ్-2 పనులకు మార్గం సుగమమైంది. రెండు దశలను అనుసంధానించడం, టికెట్ ధరల నియంత్రణ, ప్రయాణికులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించడం ఇకపై ప్రభుత్వానికే సులభతరం కానుంది. 2017లో ప్రారంభమైన మెట్రోలో ఇప్పటివరకు 86 కోట్ల ప్రయాణాలు నమోదవ్వగా, ప్రస్తుతం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు.

**సమగ్ర రవాణా వ్యవస్థే లక్ష్యం**

"ఫేజ్-1 ప్రభుత్వం పరం కావడంతో, భవిష్యత్తులో నగరం నలుమూలలకు మెట్రోను విస్తరించే ప్రణాళికలు వేగవంతం అవుతాయి. సమగ్రమైన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించడమే మా లక్ష్యం" అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ స్వాధీన ప్రక్రియతో హైదరాబాద్ మెట్రోలో ఒక కొత్త అధ్యాయం మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చికెన్ కర్రీ తెచ్చిన తంటా.. భర్తను నరికి చంపిన భార్య!

- వండమంటే వండలేదని గొడవ.. క్షణికావేశంలో కొడవలితో దాడి
- మెడ నరం తెగి అక్కడికక్కడే శివాజీ మృతి
- కామారెడ్డి గోసంగి కాలనీలో విషాదం..
- అనాథలైన ముగ్గురు పిల్లలు



కామారెడ్డి, ప్రభాత గమనం:

క్షణికావేశం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి గాలివానై ఒక నిండు సంసారాన్ని కూల్చివేసింది. కోడికూర వండలేదన్న కోపంతో భర్త నిలదీయగా, పట్టరాని ఆవేశంతో భార్య కొడవలితో దాడి చేయడంతో భర్త ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన కామారెడ్డి పట్టణంలోని గోసంగి కాలనీలో చోటుచేసుకుంది.

**అన్యోన్యంగా ఉంటూనే ఆర్థిక గొడవలు**

స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం.. గోసంగి కాలనీకి చెందిన కోదండం శివాజీ (పాత సామాన్ల వ్యాపారి), లక్ష్మిలకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మి ఇళ్లల్లో పని చేస్తూ భర్తకు ఆసరాగా ఉండేది. వీరి మధ్య గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ విషయాల్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. అయితే గొడవ జరిగిన కొద్దిసేపటికే మళ్ళీ సర్దుకుపోయి అన్యోన్యంగా ఉండేవారు.

**మాంసం కూర చిచ్చు**

పగలంతా కష్టపడి ఇంటికి వచ్చిన శివాజీ, వేడివేడిగా చికెన్ వండించుకుని తినాలని భావించాడు. మాంసం తెచ్చి భార్యకు ఇచ్చి వండమని చెప్పి బయటకు వెళ్ళాడు. తిరిగి వచ్చేసరికి భార్య కూర వండకపోవడంతో శివాజీ ఆగ్రహానికి గురయ్యాడు. ఇదే విషయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి పెద్ద గొడవకు దారితీసింది. ఇరుగుపొరుగు వారు వచ్చి సముదాయించినా గొడవ సద్దుమణగలేదు.

**కొడవలి విసరడంతో మెడ తెగి..**

శివాజీ తనను నిరంతరం వేధిస్తున్నాడన్న కోపంతో రగిలిపోయిన లక్ష్మి, ఆవేశంలో పక్కనే ఉన్న కొడవలిని బలంగా శివాజీపైకి విసిరింది. ఆ కొడవలి శివాజీ మెడకు బలంగా తగలడంతో మెడ నరం తెగి తీవ్ర రక్తస్రావమైంది. బంధువులు రక్తాన్ని ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. శివాజీ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

**అనాథలైన చిన్నారులు**

క్షణికావేశంలో భర్తను చంపుకున్న లక్ష్మి, తీరా ప్రాణం పోయాక బోరున విలపించడం అక్కడి వారిని కలచివేసింది. "నేను జైలుకు వెళ్తే నా ముగ్గురు బిడ్డల పరిస్థితి ఏంటి?" అంటూ ఆమె ఆవేదన చెందడం గమనార్హం. కామారెడ్డి పట్టణ సీఐ నరహరి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలతో పాటు, భార్య తనను దూరం పెడుతోందన్న అనుమానంతో శివాజీ గొడవ పడటం, అది కాస్తా హత్యకు దారితీయడం స్థానికంగా కలకలం రేపింది.

# కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హనుమకొండ ఏప్రిల్ 29(ప్రభాత గమనం):

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంతో పాటు, వేసవికాలంలో తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోగతిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని దూర ప్రాంతాల మిల్లులకు కాకుండా ములుకనూరు, ఎల్కతుర్తి పరిధిలోని సమీప మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా ఎక్కడా అంతరాయం కలగకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. తెలంగాణ మోడల్ స్కూల్ వద్ద మురుగునీరు నిల్వ ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో మరింత వేగం తీసుకురావాలని, లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సహకరించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. గృహ ప్రవేశాలు త్వరితగతిన నిర్వహించేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్‌ను ఆదేశించారు. మండలంలోని రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు పెయింటింగ్ పనులు చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ఉద్యాన శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంలో సర్పంచులు కూడా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను సమయానికి పూర్తి చేయాలని, కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సాగునీటి కాలువలు పూడుకుపోయిన ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలని, చెరువుల నీటిని సక్రమంగా వినియోగించి పంటలకు సాగునీరు అందించేలా ఇరిగేషన్ శాఖ అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు "బడిబాట" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, డ్రాప్‌ఔట్‌లను పూర్తిగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి విద్యా, ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. జనగామ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. వంగరలోని పీవీ విజ్ఞాన కేంద్రం పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల కోసం రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్‌డీవో మేన్ శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా ఉద్యాన అధికారి అనసూయ, డీఈవో గిరిరాజ్ గౌడ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

- రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ ఏప్రిల్ 29(ప్రభాత గమనం):

బుధవారం జిల్లా కలెక్టర్ సీరోలు, కురవి మండలాలలోని కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...జిల్లా వ్యాప్తంగా సహకార శాఖ 150, ఐకెపి 50, గిరిజన కార్పొరేషన్ 8, మెప్మా 1, శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొత్తం ( 209 ) కేంద్రాల నుండి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3934.860 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అకాల వర్షాలు రానున్న నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలని టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం మ్యాచర్ వచ్చే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని, ధాన్యం కేంద్రాల వద్ద త్రాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, రవాణా చేయు విషయంలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలను సిద్ధం చేయాలని, గన్ని సంచులు, మ్యాచ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, టెంట్లు, చేర్లు, తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోళ్లు చేసిన దాన్యంకు సంబంధించి రైతుల ఖాతా వివరాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా సంబంధిత సెంటర్ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ సివిల్ సప్లై నరసింహరావు, సంబంధిత నిర్వాహకులు పాల్గొన్నారు.




# ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు

- ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ శబరీష్

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఆధ్వర్యంలో నెహ్రూ సెంటర్ ఎండాకాలం ట్రాఫిక్ పోస్ట్ వద్ద ట్రాఫిక్ సిబ్బందికి శ్రేయస్సు దృష్ట్యా ట్రాఫిక్ పోస్ట్ లో వాటర్ మిస్ట్ స్ప్రింక్లర్స్ ఆధారిత కూలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సిస్టమ్ ద్వారా నీటి మిస్ట్ రూపంలో చల్లదనం కలిగించడంతో, మండుతున్న ఎండల్లో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి తక్షణ ఉపశమనం కలుగుతుంది. అలాగే ట్రాఫిక్ సిబ్బందికి మిల్టన్ వాటర్ ఫ్లాస్క్స్ మరియు కూలింగ్ గాగుల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం తీవ్ర ఎండల్లోనూ అంకితభావంతో పనిచేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం కాపాడటం పోలీస్ శాఖ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. వేసవి కాలంలో హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యలను నివారించేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేసారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ సిబ్బందిలో ఉత్సాహం పెంపొందడంతో పాటు, విధుల పట్ల మరింత నిబద్ధత పెరుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ మహేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ అరుణ్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో

# ఎక్సైజ్ శాఖ మెరుపు దాడి

- 1500 కిలోల నల్ల బెల్లం, పటిక స్వాధీనం
- పరారీలో నిందితులు

మహబూబాబాద్, ఏప్రిల్ 29: (ప్రభాత గమనం) :

తెలంగాణ రాష్ట్రాన్ని గుడుంబా మరియు డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మంగళవారం రాత్రి భారీగా అక్రమ రవాణా అవుతున్న నల్ల బెల్లం, పటికను అధికారులు సీజ్ చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది మరియు DTF బృందం సంయుక్తంగా నిన్న రాత్రి 11 గంటల సమయంలో ముత్యాలమ్మ గూడెం (బోడ గుట్ట తండా క్రాస్) వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. గూడూరు వైపు నుండి వాహనం వేగంగా వస్తుండటం గమనించిన అధికారులు దానిని ఆపడానికి ప్రయత్నించారు. అయితే, అధికారులను చూడగానే వాహనంలోని వ్యక్తులు ఆగకుండా బోడగుట్ట తండా మీదుగా బయ్యారం రూట్‌లోకి కారును పోనిచ్చారు. అప్రమత్తమైన ఎక్సైజ్ బృందం వారిని వెంబడించగా, నిందితులు ఉప్పరిగూడెం గ్రామం శివార్లలో వాహనాన్ని వదిలి చీకట్లోకి పారిపోయారు.అధికారులు సదరు వాహనాన్ని తనిఖీ చేయగా గుడుంబా తయారీకి వినియోగించే భారీ నిల్వలు బయటపడ్డాయి. 1500 కిలోల నల్ల బెల్లం, 150 కిలోల పటిక, 10 లీటర్ల నాటు సారాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. "తెలంగాణను మత్తు రహిత రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యం. నాటుసారా తయారీకి ముడి పదార్థాలు సరఫరా చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవు. గంజాయి, డ్రగ్స్ విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఉంచాం."రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సమాజాన్ని మత్తు పదార్థాల నుంచి రక్షించేందుకు మీడియా, యువత మరియు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని అధికారులు కోరారు.ఈ దాడుల్లో మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐలు జి. చిరంజీవి, సిహెచ్. నీరజ, ఎస్సైలు అశోక్, మౌనిక, కిరీటి మరియు కానిస్టేబుళ్లు హరీష్, విజయ్, జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.






# కార్మిక హక్కుల రక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యం

- సీపీఐ రాష్ట్ర నేత శ్రీనివాస్
- గార్లలో 141వ మేడే గోడపత్రికల ఆవిష్కరణ

గార్ల, ఏప్రిల్ 29:(ప్రభాత గమనం) :

కార్మిక వర్గ పోరాట ఫలాలను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, కమ్యూనిస్టుల అండతోనే కార్మిక హక్కులు కాపాడబడుతాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్ ఉద్ఘాటించారు. బుధవారం గార్ల మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 141వ మేడే వేడుకల గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మికుల ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు అని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పార్టీ బలోపేతం కావాలంటే ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని, కార్మికుడు ఎక్కడ సమస్యలో ఉంటే అక్కడ ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తే కమ్యూనిస్టు పార్టీ ఊరుకోదని హెచ్చరించారు.వచ్చే నెలలో నిర్వహించబోయే 141వ మేడే వేడుకలను మండల వ్యాప్తంగా కార్మికులందరూ ఐక్యంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ధూపాటి జనార్ధన్, పార్టీ నాయకులు లావుద్యా భీముడు, సింగు రమేష్, గుగులోత్ సక్రు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి




హనుమకొండ, ఏప్రిల్ 29(ప్రభాత గమనం):

మే 3న నిర్వహించనున్న నీట్ పరీక్షను ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లతో ఆయన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..మే 3 (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష సమయం కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 4,320 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. వరంగల్ ఎన్ఐటీలో రెండు కేంద్రాలు ఉండగా, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్), కాకతీయ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, లాల్ బహుదూర్ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే ప్రవేశం కల్పించబడుతుందని, 1:30 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. ఆలస్యంగా వచ్చే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని తెలిపారు. అందువల్ల అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయంలో భద్రతా పరమైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చూడాలని, ప్రశ్నాపత్రాల రవాణా, జవాబు పత్రాల భద్రతకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఒక పోస్టుకార్డు సైజు ఫోటో, ఒరిజినల్ గుర్తింపు కార్డు మరియు పారదర్శక వాటర్ బాటిల్ మాత్రమే తీసుకురావాలని తెలిపారు. పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్ వంటి స్టేషనరీ వస్తువులు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, ఇయర్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, అలాగే వాలెట్, గాగుల్స్, హ్యాండ్ బ్యాగ్, బెల్ట్, క్యాప్, షూస్ వంటి వస్తువులను అనుమతించరని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాల్సిందిగా, ఆర్టీసీ అధికారులు తగిన బస్సులను నడపాల్సిందిగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలో ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాల్సిందిగా ఆదేశించారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నీట్ జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, ఏసీపీ నరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, విద్యాశాఖ అధికారులు, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్ శాఖల ప్రతినిధులు మరియు పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## హసన్‌పర్తి పీఎస్ లో

# డీసీపీ ఆకస్మిక తనిఖీ

- పెండింగ్ కేసులపై వేగం పెంచాలని ఆదేశం




ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీసు వ్యవస్థ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌లో నిర్వహణ, కేసుల పరిష్కారం, ప్రజలతో పోలీసుల సంబంధాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై వివరాలు తెలుసుకున్న డీసీపీ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేర నియంత్రణలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి కేసును సమగ్రంగా విచారణ చేసి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అలాగే స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, జనరల్ డైరీ, ఇతర రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించిన ఆమె, రికార్డుల నిర్వహణలో కచ్చితత్వం, పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ఆధునిక విధానాలను అనుసరిస్తూ డాక్యుమెంటేషన్‌ను మెరుగుపర్చాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను పోలీసు అధికారులు తరచూ సందర్శిస్తూ ప్రజలతో నేరుగా మమేకం కావాలని, పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించేలా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకంగా యువతను దృష్టిలో ఉంచుకుని సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నుండి ప్రజలను రక్షించేందుకు చైతన్యం అవసరమని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీఐ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. డీసీపీ ధార కవిత మాట్లాడుతూ, పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం ద్వారా బాధితులకు న్యాయం చేయాలి. గ్రామాల స్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించాలి. ముఖ్యంగా యువతలో సైబర్ నేరాలపై అవగాహన పెంచడం అత్యంత అవసరం. రోడ్డు భద్రతపై కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలి," అని పేర్కొన్నారు.



# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

సంగెం మండలంలోని పల్లర్ గూడ గ్రామంలో నమ్మ దగిన సమాచారం మేరకు గుగులోతు శ్రీను విఆర్ఎన్ తండా కు సంబంధించిన వ్యక్తి పెద్ద మొత్తంలో గుడుంబా తరలిస్తున్నాడని సమాచారం రాగా తండా పరిసర ప్రాంతంలో సంగెం ఎస్సై వంశీకృష్ణ మరియు తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేయుచుండగా శ్రీను తన హీరో హోండా మోటార్ సైకిల్ పై గుడుంబా తరలిస్తుండగా పట్టుకొని 25 లీటర్ల గుడుంబా మరియు అతని బైక్ ని సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు ఈ సందర్భంగా ఎస్ఐ వంశీకృష్ణ మాట్లాడుతూ గుడుంబా అమ్మిన మేరియు అదేవిధంగా తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఫొటో పెట్టి మరీ ట్రంప్ వార్నింగ్

హైదరాబాద్, ప్రభాత గమనం:

చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదన్నారు. వారు తెలివిగా వ్యవహరిస్తే మంచిదని హితవు పలికారు. 'ఇక మీదట అంత మంచి వాడిగా ఉండను' అని పేర్కొంటూ రైఫిల్ పట్టుకున్న ఫొటోను ట్రంప్ షేర్ చేశారు.





# ముగ్గురు ఇన్ స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఇన్ స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదోన్నతులు పోలీస్ విభాగంలో సేవలందిస్తున్న అధికారుల ప్రతిభ, కృషికి గుర్తింపుగా భావిస్తున్నారు. పదోన్నతి పొందిన అధికారుల్లో హనుమకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్‌గా పనిచేస్తున్న గొర్ల సీతారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ సార్ల రాజు, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్ స్పెక్టర్ బోలగాని శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35 మంది ఇన్ స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతులు లభించగా, వరంగల్ కమిషనరేట్‌కు చెందిన ఈ ముగ్గురు అధికారుల పదోన్నతి ప్రత్యేకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా సహచర అధికారులు, సిబ్బంది వారికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా ప్రజాసేవ అందించాలని ఆకాంక్షించారు.

# ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వివరాల ప్రకారం, ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ యాదగిరి నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు చెల్లించని వారి ఇంటిపై దాడి చేసినందుకు సస్పెండ్ అయ్యారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ టి. రాములు మద్యం సేవించి నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు సస్పెన్షన్‌కు గురయ్యారు. అలాగే చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సతీష్ స్టేషన్ అధికారి ఆదేశాలను అతిక్రమించినందుకు సస్పెండ్ చేయబడ్డారు. శాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# ఎస్సెస్సీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- కేసముద్రం 'స్టేషన్' హైస్కూల్ ప్రభంజనం
- మండల టాపర్ గా అఫ్రా నిక్హత్
- 100%ఉత్తీర్ణతతో పాఠశాల రికార్డు







కేసముద్రం, ఏప్రిల్ 29:(ప్రభాత గమనం) :

ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో కేసముద్రం మండల పరిధిలోని జడ్పిహెచ్ఎస్ (జెడ్పీహెచ్ఎస్) కేసముద్రం స్టేషన్ హైస్కూల్ అద్భుత ప్రతిభ కనబరిచింది. అటు విద్యార్థుల వ్యక్తిగత స్కోర్లలోనూ, ఇటు పాఠశాల సమిష్టి ఫలితాల్లోనూ అగ్రగామిగా నిలిచి మండలంలోనే తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని మహమ్మద్ అఫ్రా నిక్హత్ 566 మార్కులు సాధించి, కేసముద్రం మండలంలోనే ప్రథమ స్థానంలో (మండల టాపర్) నిలిచింది. కేవలం టాపర్లు మాత్రమే కాకుండా, పాఠశాల మొత్తం సమిష్టిగా విజయకేతనం ఎగురవేసింది. ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ముఖ్యంగా పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల కష్టం వెరసి ఈ ఘనత సాధ్యమైందని విద్యావేత్తలు కొనియాడారు.ఈ విజయంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. మండల టాపర్‌గా నిలిచిన అఫ్రా నిక్హత్‌తో పాటు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి. రాజు మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్, పి. నరసింహారెడ్డి, బి. మదన్ మోహన్, ముదిగిరి సదయ్య, ఏ. సురేష్, డాక్టర్ కొమ్ము రాజేందర్ తదితరులు పాల్గొని విద్యార్థుల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

## గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 99శాతం ఉత్తీర్ణత

మహబూబాబాద్, ఏప్రిల్ 29(ప్రభాత గమనం):

పదవ తరగతి ఫలితాలలో 99% ఉత్తీర్ణతతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల మరియు వసతి గృహాల విద్యార్ధిని విద్యార్థులు సాదించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ ని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్ తమ శాఖ ఉద్యోగులతో మర్యాదపూర్వకంగా కలిసి పదో తరగతి ఫలితాలను గురించి తెలియజేసి పుష్పగుచ్చాన్ని అందించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు మరియు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల నుండి మొత్తం 926 మంది పరీక్ష రాయగ 916 ఉత్తీర్ణత సాధించడం జరిగింది. ఈ మంచి ఫలితాలను సాధించడం కృషిచేసిన ప్రధానోపాధ్యాయులకు , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు డిప్యూటీ వార్డులకు, పిఎంఆర్సి సిబ్బందికి మరియు విద్యార్థి విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్ అభినందించడం జరిగింది. 18 ఆశ్రమ పాఠశాలలో 13 ఆశ్రమ పాఠశాలలు 100% , 5 వసతి గృహాలలో 3 వసతి గృహాలకు 100% ఫలితాలు సాధించడం జరిగింది. అత్యధిక మార్కులు ఆశ్రమ బాలుర పాఠశాల మహబూబాబాద్ నుండి లాలావత్ ప్రశాంత్ 565 మార్కులు, ఆశ్రమ బాలికల పాఠశాల మహబూబాబాద్ నుండి ధారవత్ త్రిష 563 మార్కులు, ఏర్ల షైనీ 562 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలలో ఉన్నారు. కార్యక్రమంలో ఏటిడివో ఉపేందర్,ఏసిఎమ్ఓ రాములు, జిడిడివో విజయ,డిఆర్పీ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు కిషన్, నరసయ్య పాల్గొన్నారు.

## గార్లలో విశ్వశాంతి 'విజయ విహారం'..

గార్ల, ఏప్రిల్ 29:(ప్రభాత గమనం)

పదో తరగతి ఫలితాల్లో గార్ల మండలంలో విశ్వశాంతి విద్యాలయం మరోసారి తన అప్రతిహత విజయాన్ని చాటుకుంది. "రికార్డులు సృష్టించడం కాదు.. వాటిని తిరగరాయడం మాకు అలవాటు" అన్న చందంగా, వరుసగా రెండో ఏడాది కూడా మండల స్థాయి టాప్-3 ర్యాంకులను కైవసం చేసుకుని 'క్లీన్ స్వీప్' చేసింది.మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలను సొంతం చేసుకుని విశ్వశాంతి విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు, ప్రథమ స్థానం: జిల్లా మేఘన (575/600), ద్వితీయ స్థానం: తోకల ప్రీతిక (572/600), తృతీయ స్థానం: శ్రీ చరిత్ (566/600), వీరితో పాటు నాగ వర్షిత (563), సాయి దుర్గ (558), డి. సాత్విక్ (552), మరియు మొహమ్మద్ ముజాహిద్ (541) అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు.ఈ అద్భుత విజయంపై పాఠశాల కరస్పాండెంట్లు వడ్లమూడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డి స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది సాధించిన రికార్డును ఈ ఏడాది కూడా నిలబెట్టుకోవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. "విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం, మరియు తల్లిదండ్రుల నిరంతర సహకారమే ఈ హ్యాట్రిక్ విజయానికి పునాది. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగిస్తాం."విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పసుపులేటి రమేష్ తో పాటు ఉపాధ్యాయ బృందం వీరబత్తిని శ్రీనివాస్, షేక్ మునీర్, విజయరాజు, రవి కృష్ణ, ప్రియాంక, స్పందన, ఉపేందర్ ప్రత్యేకంగా అభినందించారు.

## వివేకానంద విద్యార్థిని ప్రభంజనం




కేసముద్రం, ఏప్రిల్ 29:(ప్రభాత గమనం) : పదో తరగతి ఫలితాల్లో కేసముద్రం మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయం ఉన్నత పాఠశాల విద్యార్థిని అల్లం భవ్యశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచారు. 600 మార్కులకు గాను 579 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. "ప్రతిరోజూ క్రమం తప్పకుండా 6 గంటల పాటు కష్టపడి చదివినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశాన్ని నోట్స్ రాసుకుని పునశ్చరణ చేసుకోవడం ఎంతో మేలు చేసిందని తెలిపారు. నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. భవిష్యత్తులో డాక్టర్ అయ్యి పేద ప్రజలకు సేవ చేయడమే నా జీవిత ఆశయమని తెలిపారు. అనంతరం "పాఠశాల ప్రిన్సిపాల్ నాగులాపాటి ఉమాకర్ మాట్లాడుతూ.. భవ్యశ్రీ మొదటి నుంచి చదువులో ఎంతో చురుకైన విద్యార్థిని అని కొనియాడారు. ఆమెలోని కష్టపడే తత్వం, క్రమశిక్షణే ఈరోజు మండల టాపర్‌గా నిలబెట్టాయని, మిగతా విద్యార్థులు కూడా భవ్యశ్రీని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



# సీఎం ను కలిసిన డీజీపీ ఆనంద్

హైదరాబాద్ (ప్రభాత గమనం): ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని రాష్ట్ర డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నూతన డీజీపీకి అభినందనలు తెలిపారు.




Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374